మరణంలోనూ నలుగురిని బతికించింది

- కిడ్నీ, లివర్, లంగ్స్ దానం

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రమాదంలో మరణించినా.... తన అవయవాలతో మరో నలుగురికి జీవం పోసింది ఓ ఇల్లాలు. వివరాల్లోకి వెళ్తే... కొండాపూర్ శ్రీరామ్ నగర్ ప్రాంతానికి చెందిన ప్రదీప్ కుమార్ తన భార్య, కొడుతో కలిసి షాపింగ్ కోసమని ఇంటి నుంచి బయలుదేరారు. ప్రయాణిస్తున్న తరుణంలో రోడ్డుపై కుక్క అడ్డురావడంతో దానిని తప్పించబోయి వారు కింద పడ్డారు. తండ్రికి కొడుకు ఎటువంటి గాయాలు కాలేదు కానీ భార్య కీర్తి శిల్పి (33) మాత్రం తలకు తీవ్రమైన గాయాలు కావడంతో కిమ్స్ కొండాపూర్‌కి తరలించారు. ఆమెను రక్షించడానికి వైద్యులు నాలుగు రోజుల పాటు ఎంతో శ్రమించారు. కానీ ఆదివారం ఉదయం బ్రెయిన్ డెడ్ అయింది. ఆ తర్వాత అవయవదానంపై కిమ్స్ ఆస్పత్రిలోని అవయవదాన సమన్వయ కర్తలు, మృతురాలి భర్తకు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. వారి అంగీకారంతో కిడ్నీలు, లివర్, ఊపిరితిత్తులు దానం చేశారు. చనిపోతూ మరో నలుగురి జీవితాల్లో వెలుగులు నింపినందుకు గర్వంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం జీవన్‌ధాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రీన్ ఛానెల్ ద్వారా అవసరం ఉన్నచోటికి అవయవాలను తరలించారని జీవన్ దాన్ కమిటీ సభ్యులు తెలిపారు.

బిజెపి దుర్మార్గ పాలన

- బిఆర్ఎస్, వైసిపి వంతపాడితే ప్రజలకు ద్రోహమే
- విద్యుత్ సవరణ బిల్లుతో ప్రజలపై భారాలు
- విద్యుత్ అమర వీరుల సంస్మరణ సభలో వామపక్ష నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'నాటి విద్యుత్ పోరాటం చారిత్రాత్మకమైంది. ఆ ఉద్యమం ఫలితంగానే ఇన్నాళ్లూ కరెంటు ఛార్జీలు పెంచేందుకు పాలకులు ధైర్యం చేయలేకపోతున్నారు. సంస్కరణల పేరుతో విద్యుత్ సంస్థలను ప్రయివేటీకరించేందుకు ప్రయత్నిస్తే నాటి పోరాట స్ఫూర్తితో మరో ఉద్యమానికి శ్రీకారం చుడతాం' అని వామపక్ష పార్టీల నేతలు హెచ్చరించారు. సోమవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ చౌరస్తాలో విద్యుత్ అమరుల స్థూపం వద్ద సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. గోవర్దన్, సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర నాయకులు ఎం హన్మేష్, ఎస్‌యుసిఐ(సి) రాష్ట్ర నాయకులు కె మురహరి, ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వి ప్రసాద్,ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, ఆర్ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి ఎస్ జానకిరాములు తదితరులు విద్యుత్ పోరాట యోధులకు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బివి రాఘవులు మాట్లాడుతూ "సరళీకరణ విధానాల్లో భాగంగా, నాటి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు భారీగా పెంచింది. ప్రయివేట్ శక్తులకు లాభం చేకూర్చే విధంగా తమ విధానాలను రూపొందించింది. అవి అన్ని తరగతుల ప్రజలకు తీవ్ర నష్టం తీసుకొస్తాయని ప్రజలు గ్రహించారు. తీవ్రంగా ప్రతిఘటించారు. ఆ పోరాటంపై ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించింది. 2000 సంవత్సరం ఆగష్టు 28న నిర్వహించిన ప్రజా ప్రదర్శనపై పోలీసులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. సంస్కరణల పేరుతో ప్రజలపై భారాలు మోపితే ఖబడ్దార్ అంటూ సాగిన ఆ పోరాటం అంతర్జాతీయంగానే ప్రఖ్యాతిగాంచింది" అని రాఘవులు చెప్పారు. ఆ పోరాటం ఫలితంగానే పాతికేండ్లుగా విద్యుత్ చార్జీలు పెంచటంగానీ, ఆ సంస్థల ప్రయివేటీకరణకు పాలకులు ధైర్యం చేయలేకపోతున్నారని తెలిపారు. ఇది కమ్యూనిస్టు పార్టీల పోరాట విజయమని గుర్తు చేశారు. ఇప్పుడు బిజెపి ప్రభుత్వం తెస్తున్న విద్యుత్ సవరణ బిల్లుతో తిరిగి ప్రమాదం ముంచుకొస్తోందని చెప్పారు. తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ కొన్నాళ్లు బిజెపి విధానాలను వ్యతిరేకించారు, ఆ తర్వాత ఏం జరిగిందో ఏమో కానీ..బిజెపి విధానాలకు దగ్గరయ్యేందుకు ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ఈ వైఖరి తీసుకోవటానికి కారణమేంటో కెసిఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీబిఆర్ఎస్ పార్టీని అమిత్ షా ఘాటుగా విమర్శిస్తున్నా.. టూజీ, నాజీలంటూ ఒకరినొకరు ఎత్తిపొడుసుకుంటున్నా, బిజెపి నిర్ణయాలపై బిఆర్ఎస్ స్పష్టమైన ప్రకటన చేయడం లేదని చెప్పారు. బిజెపితో దోబూచలాడుతున్న బిఆర్ఎస్, వైసిపిల వల్ల ఆయా రాష్ట్రాల ప్రజలతో పాటు దేశానికి ఎంత మాత్రం మంచిది కాదని తెలిపారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం నిలబడాల్సిన ప్రభుత్వాలు బిజెపికి వంత పాడే పార్టీలుగా మారకూడదని హితవు పలికారు. బిజెపిని ఓడించడానికి ఇండియా కూటమితో వెళ్ళడం కెసిఆర్‌కు నచ్చడం లేదని చెప్పారు. అందుకే వామపక్షాలతో పొత్తు వద్దనుకున్నారా? వామపక్షాలతో సానుకూలంగా ఉంటే బిజెపికి కోపం వస్తోందనీ తెగదెంపులు చేసుకున్నారా..? దీనికి కెసిఆర్ సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్‌కు, సిపిఎంకు చాలా విషయాల్లో వైరుధ్యాలున్నా..బిజెపిని ఓడించడమే కర్తవ్యంగా పెట్టుకున్నామన్నారు. బిజెపి బలపడే విధంగా వామపక్షాల పొత్తులుండవని స్పష్టం చేశారు. చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ ఉద్యమం మహత్తరమైందన్నారు. ప్రపంచ బ్యాంకు విధానాల్లో భాగంగానే అప్పటి టిడిపి ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలను అమలు చేసిందని గుర్తు చేశారు. వామపక్షాల నేతృత్వంలో ఆనాడు జరిగిన విద్యుత్ ఉద్యమానికి విస్తృత ప్రజా మద్దతు లభించిందన్నారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం అంతకంటే ఉధృతంగా ప్రపంచ బ్యాంకు, పెట్టుబడిదారీ విధానాలను అమలు చేస్తూ, విద్యుత్ సవరణ బిల్లును కేంద్రం తీసుకువచ్చిందన్నారు. దేశంలో కొన్ని రాష్ట్రాలతోపాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేసి వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లను బిగించిందనీ, దీని వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. విద్యుత్ సంస్కరణలను వ్యతిరేకిస్తూ గ్రామ స్థాయి నుంచి ప్రజా ఉద్యమం మొదలైతే మోడీ ప్రభుత్వం తట్టుకోవడం కష్టమన్నారు. విద్యుత్ సవరణ బిల్లును కేంద్రం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నర్సింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం శ్రీనివాస్, ఆర్ శ్రీరాంనాయక్, బి ప్రసాద్, ఎంవి.రమణ, సిపిఐ సీనియర్ నాయకురాలు పి. ప్రేమపావని, ప్రజాపంథా నాయకులు ఎస్ఎల్ పద్మ, ఎన్‌డినాయకులు వి సంధ్య, ఎం శ్రీనివాస్, ఎంసిపిఐ (యు) నాయకులు వనం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అమరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

దళితుల భూములు తిరిగివ్వాలి

- కిసాన్ కాంగ్రెస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దళితుల భూములను తిరిగివ్వాలనీ, ధరణితో హక్కులు పొందలేని వారికి హక్కు పత్రాలివ్వాలనీ, పంటలకు నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం గాంధీభవన్‌లో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేష్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రైతు గోస కార్యక్రమంలో తీర్మానించారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జీ మాణిక్ రావు ఠాక్రే, ఎఐసిసి కార్యదర్శి రోహిత్ చౌదరీ, జాతీయ కిసాన్ కాంగ్రెస్ వైస్ చైర్మన్ కోదండరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందనవెల్లి గ్రామ దళిత రైతులు భూములు కోల్పోయామనీ, ఆరుట్ల ప్రాంతానికి చెందిన తండ వాసులు ధరణితో భూమి హక్కులు రాలేదనీ, గజ్వేల్ నియోజకవర్గం వర్గల్ మండలంలో భూములు లాక్కున్నారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్ట్ కింద వున్నా రైతులు శాస్త్రీయంగా చెక్ డ్యాములు నిర్మించకపోవడంతో భూములు కోతకు గురై ఇసుకమేటలు పెట్టి సాగుకు పనికి రాకుండా పోయినట్టు తెలిపారు. బాల్కొండ వేములవాడ మంథని నియోజకవర్గాలకు చెందిన రైతులు తమకు నష్టపరిహారం రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని నాయకులు వారికి భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టి సెల్ చైర్మన్ బెల్లయ్య నాయక్, ఎస్‌సి సెల్ చైర్మన్ నగరి ప్రీతం తదితరులు పాల్గొన్నారు.

శ్రీభవానీ జ్యువెల్స్ తొలి వార్షికోత్సవ వేడుకలు

హైదరాబాద్ : శ్రీ భవానీ జ్యువెల్స్ మొదటి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నట్లు తెలిపింది. ఈ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఎంతైతే బంగారం కొంటారో అంతే బరువు గల వెండిని ఉచితంగా పొందవచ్చని ఆ సంస్థ డైరెక్టర్ వినోద్ కుమార్ బంగ్, రిటైల్ సేల్స్ హెడ్ రవి కిరణ్ మల్లకేడి తెలిపారు. వెండి వస్తువులు, ఆభరణాలకు ఎటువంటి మేకింగ్ చార్జీస్ వసూలు చేయడం లేదన్నారు తమ సంస్థ 1966 నుంచి వినియోగదారులు విశ్వాసాన్ని, ప్రోత్సాహాన్ని పొందుతుందన్నారు. తమ సంస్థకు నాగోల్, మలక్‌పేట్, హిమాయత్‌నగర్, కూకట్‌పల్లి-జెఎన్‌టియులో స్టోర్స్ ఉన్నాయన్నారు. తమ సంస్థకు డైరెక్టర్లుగా వినోద్ కుమార్ బంగ్, ప్రమోద్ కుమార్ బంగ్, కృష్ణ సంగి, ఆనంద్ సంగి ఉన్నారన్నారు.

సమాన విద్యతోనే సమాజంలో సమానత్వం

- అసమాన భావజాల పార్టీలు బిజెపి, బిఆర్ఎస్
- ఆ పార్టీలను ఓడించాలి
- 'అభ్యసన సంక్షోభం' సదస్సులో ఎస్‌డిఎఫ్ కన్వీనర్ మురళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"అందరికి సమాన విద్య అందినప్పుడే సమాజంలో సమానత్వం వస్తుంది. ఆ సమాన విద్యనందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. అయితే కేంద్రం, రాష్ట్రంలో పాలిస్తున్న బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు అసమాన భావజాలాన్ని విశ్వసించేవి. అందుకే ఆ ప్రభుత్వాలు అందరికి సమాన విద్యనందించడం లేదు. అందరూ సమానంగా ఉండొద్దని కోరుకునే ఆ రెండు పార్టీలు నేడు సమాజాన్ని శాసిస్తున్నాయి. సిఎం కెసిఆర్ ప్రభుత్వ విద్యను ధ్వంసం చేయాలని కంకణం కట్టుకున్నారు. మన ఊరు-మన బడి పథకంతో ప్రభుత్వ స్కూళ్లను మెరుగుపరిచేందుకు రూ.7,278 కోట్లను వెచ్చించనున్నట్టు సిఎం కెసిఆర్ ప్రకటించారు. గతేడాది, ఈ ఏడాది బడ్జెట్లలో ఒక్క రూపాయి కేటాయించలేదు. దేశంలో 11 లక్షల ప్రభుత్వ పాఠశాలలున్నాయి. అందులో ఐదేండ్ల కాలంలో కేవలం 14,600 మాత్రమే అభివృద్ధి చేస్తామని బిజెపి సర్కార్ ప్రకటించింది. సమాజంలో అందరికి సమాన అవకాశాలు, సమాన విద్యనందించే సంకల్పం లేనీ బిజెపి, బిఆర్ఎస్ పార్టీలను రాబోయే ఎన్నికల్లో ఓడించాలి....' అని సోషల్ డెమోక్రటిక్ ఫోరం (ఎస్‌డిఎఫ్) కన్వీనర్, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఆకునూరి మురళీ ప్రజలను కోరారు. ఎంవి ఫౌండేషన్ (ఎంవిఎఫ్), చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం (సిఆర్‌పిఎఫ్), తల్లుల సంఘం సంయుక్తాధ్వర్యంలో సోమవారం బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో.. రాష్ట్రంలో దిగజారిన విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని కోరుతూ రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సిఆర్‌పిఎఫ్ రాష్ట్ర కన్వీనర్ జి.వేణుగోపాల్, తల్లుల సంఘం కన్వీనర్ జి.భాగ్యలక్ష్మి, ఎంవిఎఫ్ జాతీయ కన్వీనర్ ఆర్.వెంకటరెడ్డి, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మాజీ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ శాంతాసిన్హా, తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం, టిపిటిఎఫ్ నాయకులు ఇ.రఘునందన్, అధ్యక్షులు వై.అశోక్ కుమార్, బహుజన టీచర్స్ ఫెడరేషన్ నాయకులు ఎన్.యాదగిరి, స్వచ్ఛంద సేవా సంస్థ సాధన డైరెక్టర్ సీహెచ్.మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, నాణ్యమైన విద్య కోసం రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధులను నిలదీయాలని సూచించారు. ప్రభుత్వ స్కూళ్లను పట్టించుకుంటేనే ఓటేస్తామని చెబితే పాలకులు దిగి వస్తారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు టీచర్ల నియామకం చేపట్టడం లేదు. ఉపాధ్యాయులు లేని ప్రభుత్వ పాఠశాలలు వదిలి పిల్లలు ప్రయివేటుకెళ్తున్నారు. దీంతో పిల్లలు లేని పాఠశాలలెందుకంటూ వాటిని మూసేస్తూ విద్యపై బిఆర్ఎస్ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. శాంతాసిన్హా మాట్లాడుతూ.. విద్యారంగం పూర్తిగా ప్రభుత్వమే నడపాలని డిమాండ్ చేశారు. విద్యలో రాష్ట్రం వెనుకబడిందనీ, దీంతో అంకెలను మార్చి ప్రగతిని చూపించేందుకు చేసే నేరపూరిత చర్యల్లో ఉపాధ్యాయులను కూడా భాగస్వాములు చేస్తారని ఆరోపించారు.

అత్యంత వెనుకబడిన తెలంగాణ

2021-22 సంవత్సరపు పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ నివేదికలో 36 రాష్ట్రాలకుగాను తెలంగాణ 31వ స్థానంలో నిలిచిందని వెంకటరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అభ్యసన ఫలితాల్లో 35వ స్థానంతో అత్యంత వెనుకబడిందని తెలిపారు. ఎంవీఎఫ్, సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో 17 జిల్లాల్లో ఆరు నుంచి తొమ్మిదో తరగతి చదివే ప్రభుత్వ, ప్రయివేటు విద్యార్థుల్లో విద్యాసామర్థ్యాలను పరిశీలించినట్టు తెలిపారు. తెలుగులో 37 శాతం మంది విద్యార్థులు, పరిసరాల విజ్ఞానంలో 41 శాతం మంది విద్యార్థులు ఏమి రాయలేకపోయారనీ, 39 శాతం మంది లెక్కల్లో ప్రయత్నం చేయకుండానే వదిలేశారని తెలిపారు. విద్యాసామర్థ్యాలు అందించడం ప్రభుత్వాల చట్టబద్ధ బాధ్యతగా గుర్తించాలనీ, నాణ్యమైన విద్యనందించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలన్నింటిని రాబోయే ఎన్నికల్లో రాజకీయ పార్టీలు, ఎమ్మెల్యేలు, అభ్యర్థుల దృష్టికి తీసుకెళతామని తెలిపారు.

దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకే చేవెళ్ల డిక్లరేషన్

- పాలమూరు ప్రజలు జెండాలను పక్కనబెట్టి కాంగ్రెస్‌ను గెలిపించాలి
- అధికారంలోకి రాగానే రైతులకు రూ. రెండు లక్షల రుణ మాఫీ
- నెలకు రూ. నాలుగు వేల పెన్షన్
- పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేస్తాం
- టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి
- కాంగ్రెస్‌లో చేరిన నాగర్‌కర్నూల్, అచ్చంపేట బిఆర్ఎస్ నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చేవెళ్ల దళిత-గిరిజన డిక్లరేషన్ అమలు చేసి దళితులు, గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపుతామని టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. దళితులు, గిరిజనుల జీవితాలలో గుణాత్మక మార్పే లక్ష్యంగా దళిత-గిరిజన డిక్లరేషన్ ప్రకటించినట్టు తెలిపారు. సోమవారం నాగర్‌కర్నూలు, అచ్చంపేట నియోజకవర్గాలకు చెందిన బిఆర్ఎస్ నాయకులు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. జూబ్లీహిల్స్ నివాసంలో ఆయన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పాలమూరు ప్రజలు జెండాలను, ఎజెండాలను పక్కనబెట్టి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. పాలమూరు జిల్లాలో 14కు 14 సీట్లు గెలిపిస్తే రాష్ట్రంలో 100 సీట్లు గెలిపించే బాధ్యత తమదేనన్నారు. బిఆర్ఎస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పాలమూరు జిల్లాలోని అన్ని సాగు నీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని రేవంత్ హామీ ఇచ్చారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, బీడీ కార్మికులకు, ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఎయిడ్స్ బాధితులకు, ఫైలేరియా డయాలిసిస్ పేషంట్లకు నెలకు రూ. నాలుగు వేల పెన్షన్ ఇస్తామని తెలిపారు. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని మరోసారి హామీనిచ్చారు. రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలు భర్తీ చేయడంతోపాటు రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు రూ.ఐదు లక్షల వరకు వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఇల్లు కట్టుకునే ప్రతీ పేదవాడికి రూ.5 లక్షల సాయం అందిస్తామని వెల్లడించారు.

కెసిఆర్ ఖేల్ ఖతం - బిఆర్ఎస్ దుఖాన్ బంద్ రేవంత్ ట్వీట్

యావత్ తెలంగాణ గుండె చప్పుడు ఒక్కటేనని, "కెసిఆర్ ఖేల్ ఖతం - బిఆర్ఎస్ దుఖాన్ బంద్" అని రేవంత్ రెడ్డి మంత్రి కెటిఆర్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన డిక్లరేషన్‌పై కేటీఆర్ విమర్శలు చేసిన నేపథ్యంలోనే మంత్రిని ట్యాగ్ చేస్తూ రేవంత్‌రెడ్డి కౌంటర్ ట్వీట్ పోస్ట్ చేశారు. తమ డిక్లరేషన్ దళిత - గిరిజన జీవితాలలో గుణాత్మక మార్పునకు కన్ఫర్మేషన్ అని తెలిపారు. దళితుడ్ని సిఎం చేస్తానని, దళిత కుటుంబాలకు మూడెకరాల భూమి ఇస్తామని, గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్ పెంచుతామని మోసం చేయడం లాంటిది కాదంటూ పరోక్షంగా బీఆర్ఎస్ మోసం చేసిందని గుర్తుచేశారు. మద్దతు ధర అడిగిన గిరిజన రైతులకు బేడీలు వేయడం, నేరెళ్ల ఇసుక దోపిడీ ప్రశ్నించిన దళిత, బీసీలపై థర్ డిగ్రీ ప్రయోగించడం, కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన అసైన్డ్ భూములు లాక్కొని రియల్ ఎస్టేట్ మాఫియాకు అమ్ముకోవడం, దళిత మరియమ్మ లాకప్‌డెత్, ఒక్క మాదిగకు మంత్రి పదవి ఇవ్వకపోవడం, ఎస్సీ వర్గీకరణ చేయకపోవడం. దళిత బంధు పథకంలో 30 శాతం కమీషన్లు తీసుకోవడం వంటి డిక్లరేషన్ కాదని స్పష్టం చేశారు.

సాయిచంద్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇటీవల మృతి చెందిన తెలంగాణ ఉద్యమ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ వేద సాయిచంద్ కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేసింది. సాయిచంద్ సతీమణి రజినికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.కోటి చెక్కును సోమవారం మంత్రి సబితా ఇంద్రారెడ్డి అందజేశారు.సిఎం ఆదేశాల మేరకు గుర్రంగూడలోని సాయిచంద్ ఇంటికి వెళ్లి ఈ చెక్కును ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, మంచిరెడ్డి కిషన్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనిత రెడ్డి పాల్గొన్నారు. వనపర్తి జిల్లా అమరచింతకు చెందిన సాయి చంద్.. జూన్ 29న గుండెపోటుతో హఠాన్మరణం చెందిన సంగతి తెలిసిందే.

డెంగీతో స్టాఫ్ నర్స్ మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ములుగు జిల్లా ఏటూరునాగారం సామాజిక వైద్యశాలలో ఎంసిహెచ్ స్టాఫ్ నర్సు సాధనపెల్లి రజని డెంగీ జ్వరంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. వాజేడు మండలానికి చెందిన రజిని ఏటూర్‌నాగారం సామాజిక ఆస్పత్రిలో పనిచేస్తోంది. మూడు రోజులుగా డెంగ్యూతో స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

రజని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఎంజీఎంకు తరలిస్తుండగా.. తాడ్వాయి-ములుగు మార్గమధ్యలో ఆమె మృతిచెందారు. రజిని వాజేడులోని కొప్పూరులో భర్త, పిల్లతో కలిసి ఉంటూ సామాజిక ఆస్పత్రికి విధులపై వస్తుంటుంది. ఈ క్రమంలో అనారోగ్యానికి గురికావడంతో మెరుగైన చికిత్స అందించే క్రమంలో మృతిచెందారని భర్త తాజ్ తెలిపారు.

స్టాఫ్ నర్స్ రజని మృతితో ఆస్పత్రి సూపరింటెండెంట్ సురేష్‌కుమార్, వైద్యులు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఫిర్యాదుల స్వీకరణకు డిసిఎ టోల్ ఫ్రీ నంబర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డ్రగ్ కంట్రోల్ అథారిటీ (డిసిఎ) ఫిర్యాదుల స్వీకరణకు టోల్ ఫ్రీ నంబర్ 1800 599 6969ను అందుబాటులోకి తెచ్చింది. ఈ నంబర్ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేయనున్నది. ఈ మేరకు సోమవారం డిసిఎ డైరెక్టర్ జనరల్ వీ.బీ.కమలాసన్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఔషధాలను చట్ట విరుద్ధంగా అమ్మడం, నకిలీ ఔషధాలు అమ్మడం, నాణ్యత, ధర, అందుబాటులో లేకపోవడంతో పాటు తప్పుదోవ పట్టించే ప్రకటనలకు సంబంధించి ప్రజలు టోల్ ఫ్రీ నంబర్‌లో సమాచారమివ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి గుర్తింపును గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు.

ఎటూ తేల్చుకోలేక..!

- ఊగిసలాటలో మాజీ మంత్రి తుమ్మల
- 6వ తేదీ నాటికి తుది నిర్ణయం?
- లాభనష్టాలపై బేరీజు వేస్తున్న కెసిఆర్
- తుమ్మల విషయమై బిఆర్ఎస్ అభ్యర్థులతో భేటీ
- చర్చనీయాంశంగా మారిన వనమా బి-ఫామ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయ ముఖచిత్రం రోజుకో రీతిలో మార్పులు చోటు చేసుకుంటున్నది. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఊగిసలాట ధోరణిలో ఉన్నారు. ఆయన కారు దిగడం.. చేయందుకోవడం లాంఛనమేననే చర్చ సాగుతోంది. అయితే ఆయన పోటీ చేసే స్థానం విషయంలోనే సందిగ్ధత నెలకొంది. తుమ్మల పాలేరు నుంచి టిక్కెట్ ఆశిస్తుండగా కాంగ్రెస్ అధిష్టానం మాత్రం ఖమ్మం నుంచి పోటీ చేయాలని కోరినట్టు తెలుస్తోంది. ఈ విషయంలో స్పష్టత వస్తే ఆయన వచ్చేనెల 6న కాంగ్రెస్ గూటికి చేరతారనే చర్చ సాగుతోంది. మరోవైపు బిఆర్ఎస్ ఉమ్మడి జిల్లా నేతలతో కెసిఆర్ ఆదివారం హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి కొత్తగూడెం అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావుకు సమాచారం లేదని తెలిసింది. వనమాను అభ్యర్థిగా ప్రకటించినా బిఫామ్ ఇవ్వకపోవచ్చునే వార్తలు వినిపిస్తున్నా యి. దీన్ని వనమా అనుచరులు కొట్టిపారేస్తున్నారు.

సందిగ్ధంలో 'గులాబీ' బాస్..

తుమ్మల నాగేశ్వరరావు విషయంలో ఎటూతేల్చుకోలేని సందిగ్ధావస్థలో 'గులాబీ'బాస్ ఉన్నారు. ఈ నేపథ్యంలోనే జిల్లా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్‌తో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ అభ్యర్థులు బాణోత్ హరిప్రియ(ఇల్లెందు), రేగా కాంతారావు (పినపాక), మెచ్చా నాగేశ్వరరావు (అశ్వారావుపేట), తెల్లం వెంకట్రావు (భద్రాచలం)తో హైదరాబాద్‌లో కెసిఆర్‌తో భేటీ అయ్యారు. తుమ్మల ప్రభావం ఉమ్మడి జిల్లాపై ఏ మేరకు ఉంటుందనే అంశంపై చర్చించినట్టు సమాచారం. తుమ్మల స్వస్థలం దమ్మపేట మండలం గండుగులపల్లి కాబట్టి అశ్వారావుపేట నియోజ కవర్గం, అలాగే టిడిపి హయాంలో మంత్రిగా భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వామ్యం అధికంగా ఉండటంతో ఆ నియోజకవర్గంపై అధికంగా, కొత్త గూడెం, ఇల్లెందు, పినపాక నియోజకవర్గాల పై పాక్షికంగా ప్రభావం ఉంటుందని విశ్లేషించినట్టు తెలుస్తోంది. ఖమ్మం జిల్లాలో దాదాపు అన్ని నియోజకవర్గాల పై ప్రభావం బాగానే ఉంటుందని కొంతమంది చెప్పినట్టు సమాచారం. తుమ్మలను వదులుకోవడంతో చోటుచేసుకునే పరిణామాలు, ప్రత్యర్థికి ఒనగూరే లాభనష్టాలపైనా విశ్లేషించి ఉంటారని విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటికే పొంగులేటి శ్రీనివాసరెడ్డి లాంటి బలమైన నేత పార్టీని వీడిన దృష్ట్యా తుమ్మల విషయంలో నిర్ణయ పర్యవసానాలపై ఒకింత లోతైన చర్చే జరిగి ఉండొచ్చని బిఆర్ఎస్ శ్రేణులు అభిప్రాయపడ్డాయి.

వనమాకు సమాచారం లేకపోవడంపై చర్చ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభ్యర్థులు ఐదుగురిలో నలుగురికి ప్రగతి భవన్ నుంచి శనివారం సమాచారం అందడంతో హైదరాబాద్ వెళ్లారు. ఆ రోజు సిఎంకు వీలుకాకపోవడంతో ఆదివారం సాయంత్రం భేటీ అయ్యారు. అయితే కొత్తగూడెం అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావుకు మాత్రం సమాచారం లేకపోవడంపై చర్చ సాగుతోంది. కొత్త గూడెం నియోజకవర్గంలో బలమైన అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు అని భావించే అభ్యర్థిగా ప్రకటించారని, ఆయనకు టిక్కెట్ రాని పక్షంలో పార్టీ వీడితే 'కారు' ఫలితం తారుమారు అవుతుందనే ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యేగా అనర్హత కేసు ఎలాగూ ఉంది కాబట్టి ఒకవేళ కోర్టు వనమాకు వ్యతిరేకంగా తీర్పు ఇస్తే ఆ నెపంతో మరొకరికి టిక్కెట్ కేటాయించవచ్చనే ఎత్తుగడతోనే కెసిఆర్ టిక్కెట్ ఇచ్చారనే చర్చ ఒకటి వైరల్ అవుతోంది. అదే జరిగితే తన చేతికి మట్టి అంటకుండా వనమాను తప్పించొచ్చనే వ్యూహంతో కెసిఆర్ ఉన్నారనే మాట వినిపిస్తోంది. కానీ వనమా అనుచరులు మాత్రం ఈ భేటీకి సమాచారం లేక పోవడానికి వేరే కారణాన్ని చూపుతున్నారు. నలుగురు అభ్యర్థుల మీటింగ్‌కు రెండురోజుల ముందుగానే వనమా ప్రత్యేకంగా సిఎంను కలిశారని, అందుకే ఈ సమావేశానికి సమాచారం అందలేదని చెబుతున్నారు. నిజానిజాలు ఎలా ఉన్నా వనమా బిఆర్ఎస్ అభ్యర్థిత్వంపై బిఫామ్ వచ్చేంత వరకు నిర్ధారణకు రాలేమని బిఆర్ఎస్‌లోని కొందరు నేతల మాట. ఏ క్షణానైనా వనమా అభ్యర్థిత్వం గల్లంతయ్యే ఛాన్స్ ఉందనే విశ్వాసంతో రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస్ ఉన్నారు. అలాగే రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కూడా కొత్తగూడెం నుంచి పోటీపై ఆసక్తి చూపుతున్నారు. జలగం సైతం ఇంకా ఫైనల్ నిర్ణయానికి రాకుండా అచితూచి అడుగులు వేస్తున్నారు.

జనరేటివ్ ఎఐతో విప్లవాత్మక మార్పులు

- ఐటి, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్‌రంజన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పరిశ్రమల్లో విప్లవాత్మక మార్పులు, రాష్ట్ర సాంకేతిక వృద్ధిని నడిపించే సామర్థ్యాన్ని జనరేటివ్ ఎఐకి ఉందని విశ్వసిస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్‌రంజన్ తెలిపారు. ఈ వర్క్‌షాప్ ఆవిష్కరణ, సహకారాన్ని పెంపొందించ డంలో తమ నిబద్ధతను సూచిస్తుందన్నారు. నిపుణులతో కలిసి పని చేస్తామని, భవిష్యత్తులో ఉత్పాదక ఎఐ పురోగమనాల్లో రాష్ట్రం ముందుంటుందని ధీమా వ్యక్తంచేశారు. టీ-ఎఐఎం, జెనరేటివ్ ఎఐ స్టార్టప్‌లను అభివృద్ధి చేయడానికి, స్కేల్ చేయడానికి మద్దతు ఇచ్చే మార్గాలను అన్వేషించడానికి భాగస్వామ్యాలను చురుకుగా రూపొందిస్తోందన్నారు. తెలంగాణ ఏఐ మిషన్(టీ-ఎఐఎం) ఇటీవల రాష్ట్రం కోసం జనరేటివ్ ఎఐపై ప్రారంభ వ్యూహాత్మక వర్క్‌షాప్‌ను సోమవారం నిర్వహించింది. సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పరిశ్రమలు, విద్యా నిపుణులను కలిసి రాష్ట్రాన్ని జనరేటివ్ ఎఐ హబ్‌గా మార్చేందుకు వ్యూహరచన చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేవారిని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్, కామర్స్ డిపార్ట్‌మెంట్ నుంచి ఎమర్జింగ్ టెక్నాలజీస్ వింగ్ డైరెక్టర్ రమాదేవిలంక స్వాగతించారు. నాస్కామ్ ద్వారా రూపొందించిన వర్క్‌షాప్ డిజైన్-థింకింగ్ సెషన్‌లోకి ప్రవేశించిందని తెలిపారు.

GOWRA LEASING & FINANCE LIMITED
GOWRA GROUP
CIN : L65910TG1993PLC015349
Regd Office : 501, 5th Floor, Gowra Grand, Behind Gowra Plaza, #1-8-384 & 385, S.P.Road, Begumpet, Secunderabad - 500003.
Ph :040-27843086, E-mail : info@gowraleasing.com, Website: www.gowraleasing.com

30వ వార్షిక సర్వసభ్య సమావేశం, ఇ ఓటింగ్ మరియు బుక్ క్లోజర్ గురించి సభ్యులకు నోటీసు

కంపెనీల చట్టం 2013 నిబంధనలు, (ది యాక్ట్), మరియు సెక్యూరిటీ అండ్ ఎక్సెంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్, అండ్ డిస్క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) నిబంధనలు 2015తో పాటు ఎజిఎమ్ నోటీసులో పేర్కొన్న విధంగా వ్యాపార లావాదేవీలను నిర్వహించాడానికి కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ ("ఎమ్‌సిఎ") మరియు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్‌ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా ద్వారా జారీ చేసిన అన్నీ వర్తించే సర్క్యులర్లు విషయం గౌరా లీజింగ్ అండ్ ఫైనాన్స్ లిమిటెడ్ 30వ వార్షిక సర్వసభ్య సమావేశం సెప్టెంబర్ 20, 2023వతేదీ బుధవారం సా. 04.00 గంటలకు వీడియో కాన్ఫరెన్స్(VC)/ఇతర ఆడియో విజువల్ విధానం (OAVM) ద్వారా నిర్వహించబడునని సభ్యులకు ఈ నోటీసు ద్వారా తెలియచేయటమైనది. దయచేసి అందులో పాల్గొనేందుకు అనుకూలంగా ఉండండి.

ఎమ్‌సిఎ/సెబి జారీ చేసిన సర్క్యులర్ల ప్రకారం, కంపెనీ యొక్క హరిత విధానానికి మద్దతుగా పైన పేర్కొన్న సమావేశపు నోటీసులను సభ్యులకు ఎలక్ట్రానిక్ విధానం ద్వారా మీ డిపాజిటరీ పార్టిసిపెంట్స్/రిజిస్ట్రార్ మరియు కంపెనీ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్ కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్ హైదరాబాద్ వద్ద రిజిస్టర్ చేసుకున్న మీ ఇ మెయిల్ చిరునామాలకు పంపబడ్డాయి.

కంపెనీ రిజిస్ట్రార్, షేర్ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్ మెస్సర్స్ కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్ వద్ద తమ ఇ-మెయిల్ చిరునామాలు, మొబైల్ నెంబర్లు రిజిస్టర్ చేసుకోని సభ్యులు ఈ వివరాలతో పాటు ఇ మెయిల్ చిరునామా అందించిన అభ్యర్థన లేఖ యొక్క సంతకం కాపీ యొక్క స్కానెడ్ కాపీ, మొబైల్ నెంబర్, స్వీయ ధృవీకరణ పాన్ కాపీ మరియు ఎలెక్ట్రానిక్ ఫోలియో యొక్క కేస్‌లో క్లయింట్ మాస్టర్ కాపీ మరియు వార్షిక నివేదికను పంపడానికి భౌతిక ఫోలియో సర్టిఫికేట్ వాటా కాపీ, ఎజిఎమ్ నోటీసు మరియు ఇ ఓటింగ్ సూచనల కొరకు ఇ మెయిల్ ఐడి: einward.ris@kfintech.com కు పంపి తాత్కాలికంగా నమోదు చేసుకోవల్సిందిగా కోరటమైనది. 30వ వార్షిక సర్వసభ్య సమావేశం నోటీసుతో పాటు 2022-23 సంవత్సరానికి సంబంధించిన వార్షిక నివేదిక కంపెనీ వెబ్‌సైట్ https://www.gowraleasing.com/annual reports.php లోనూ, స్టాక్‌ఎక్స్ఛేంజ్‌ల వెబ్‌సైట్ www.bseindia.com లోనూ పొందపర్చబడినది.

2015 నాటి సెబి (లిస్టింగ్ ఆబ్లిగేషన్ అండ్ డిస్క్లోజర్ రిక్వైర్‌మెంట్) లిస్టింగ్ రెగ్యులేషన్స్ యొక్క 44వ నిబంధన, 2013 నాటి కంపెనీల చట్టం సెక్షన్ 108, 2014 నాటి కంపెనీస్ (మేనేజ్‌మెంట్, అడ్మినిస్ట్రేషన్) నిబంధనలలోని సవరించిన రూల్ 20 ప్రకారం సభ్యులకు ఎజిఎమ్ సమావేశ స్థలం వద్దే ఎలక్ట్రానిక్ ఓటింగ్ సౌకర్యం కల్పించబడునని తెలియచేయుటకు కంపెనీ సంతోషం వ్యక్తం చేస్తోంది. కటాఫ్ తేదీ 13 సెప్టెంబర్, 2023 నాటికి (భౌతిక, ఎలక్ట్రానిక్ రూపంలో షేర్లు కలిగిన) సభ్యులందరూ వార్షిక సర్వసభ్య సమావేశంలో ప్రవేశపెట్టబడిన తీర్మానాలపై తమ ఓటింగ్ కోసం ఈ సౌకర్యాన్ని వినియోగించుకో వచ్చు.

- రిమోట్ ఇ-ఓటింగ్ (ఎజిఎమ్ సమావేశ స్థలం నుండి కాక ఇతర ప్రదేశం నుండి ఎలక్ట్రానిక్ పద్ధతిలో సభ్యులు ఓటు హక్కును వినియోగించుకునే సౌకర్యం కూడా కల్పించబడింది) లేదా
- ఎజిఎమ్ సమావేశం సమయంలోనే ఎలక్ట్రానిక్ ఓటింగ్ జరుగుతుంది. విసి/ఓఎవిఎం పద్ధతిలో జరిగే సమావేశ సమయంలోనే కంపెనీ ఈ సౌకర్యాన్ని కల్పిస్తోంది. దీనికి ప్రత్యేకంగా లాగిన్ అవసరం లేదు. రిమోట్ విధానం ద్వారా ఓటు హక్కు వినియోగించుకోకుండా వార్షిక సర్వసభ్య సమావేశానికి హాజరైన సభ్యులు, ఈ సౌకర్యం వర్తించని ఇతర సభ్యులకు సమావేశ సమయంలో ఛైర్మన్ సలహామేరకు ఇ-ఓటింగ్ వ్యవస్థ లోని ఇ-వోటింగ్ విండో తెరవబడుతుంది.

ఈ రిమోట్ ఇ-ఓటింగ్ సౌకర్యానికి అవసరమైన వసతులను మెస్సర్స్ కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంస్థ కల్పిస్తుంది. రిమోట్ ఇ-ఓటింగ్ 17 సెప్టెంబర్, 2023 ఆదివారం (ఉ. 9 గం. నుండి) ప్రారంభమై 19 సెప్టెంబర్ 2023 మంగళవారం (సా. 5 గం.కు) ముగుస్తుంది. కటాఫ్ తేదీ 13 సెప్టెంబర్ 2023 నాటికి కంపెనీ షేర్లు భౌతిక, ఎలక్ట్రానిక్ రూపంలో కలిగి వున్న సభ్యులు ఈ సమయంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. వార్షిక సర్వసభ్య సమావేశానికి విసి/ఓఎవిఎం విధానాలలో హాజరు కాదలచుకున్న సభ్యులకు మెస్సర్స్ కెఫిన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ (కెఫిన్) సంస్థ తమ ఇ-ఓటింగ్ వ్యవస్థ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ఇందుకు సంబంధించిన వివరాలు నోటీసులో పొందుపర్చబడ్డాయి.

కంపెనీ వార్షిక సర్వసభ్య సమావేశానికి నోటీసు జారీ అయిన తరువాత, 13 సెప్టెంబర్, 2023 బుధవారం కు ముందు ఎవరైనా వ్యక్తి కంపెనీ సభ్యులుగా నమోదు కాదల్చుకుంటే అతడు/ఆమె enwards.ris.@kfintech.com/ evoting@kfintech.com కు ఇమెయిల్ పంపటం ద్వారా తమ లాగిన్ ఐడి మరియు పాస్‌వర్డ్‌లను పొందవచ్చు. ఒక వేళ ఆ వ్యక్తులు ఇప్పటికే కెఫిన్ వద్ద తమపేర్లను నమోదు చేసుకుని వుంటే ఇప్పటికే తమ వద్ద ఉన్న లాగిన్ ఐడి మరియు పాస్‌వర్డ్‌లను వినియోగించి ఓటింగ్‌లో పాల్గొనవచ్చు.

సభ్యులు ఈ దిగువ అంశాలను గమనించాల్సిందిగాకోరటమైనది.

- రిమోట్ ఇ-ఓటింగ్ మాడ్యుల్ 19 సెప్టెంబర్ 2023 మంగళవారం సా. 5.00 గం. తరువాత ఇ- ఓటింగ్ కొరకు డిసేబుల్డ్ చేయబడుతుంది.
- ఒకసారి తీర్మానంపై ఓటు హక్కు వినియోగించుకున్న సభ్యుడు దానిని మార్పు చేసేందుకు అనుమతించబడరు.
- వార్షిక సర్వసభ్య సమావేశానికి ముందే రిమోట్ ఓటింగ్‌లో పాల్గన్న సభ్యులు కూడా సమావేశానికి హాజరు కావచ్చు. అయితే సమావేశ సమయంలో వారు మరోసారి ఓటు వేసే అవకాశం వుండదు. మరియు
- కటాఫ్ తేదీ 13 సెప్టెంబర్, 2023, బుధవారం నాటికి కంపెనీ డిపాజిటరీలు నిర్వహిస్తున్న కంపెనీ సభ్యులు లేదా లబ్దిపొందిన యజమానుల జాబితాలో పేరు నమోదు చేసుకున్న వ్యక్తులు మాత్రం రిమోట్ ఓటింగ్ తో పాటు ఎజిఎమ్ సమావేశ సమయంలో జరిగే ఓటింగ్‌లో కూడా పాల్గొనేందుకు అర్హులుగా పరిగణింపబడతారు.

ఇ-ఓటింగ్ విధానానికి సంబంధించిన ప్రక్రియ వివరాలు నోటీసులో పొందుపర్చబడ్డాయి. ఒక వేళ దీనికి సంబంధించి ఎవరికైనా సందేహాలుంటే వారు ఇ-ఓటింగ్, మరియు షేర్ హోల్డర్లకు సంబంధించిన యూజర్ మాన్యువల్ లోని తరచు అడిగే ప్రశ్నల ను సంప్రదించవచ్చు. ఈ యూజర్ మాన్యువల్‌ను https:// evoting.karvy.com నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు, లేదా రఘు వీధా, కెఫిన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ (యూనిట్ గౌరా లీజింగ్ అండ్ ఫైనాన్స్ లిమిటెడ్) ను ఇ మెయిల్ ద్వారా enwards.ris. @kfintech.com/ evoting@kfintech.com ను లేదా కాంటాక్ట్ నెం. 040-67161606 ను లేదా కెఫిన్‌టెక్ టోల్‌ఫ్రీ నెం. 1800-345-4001ను సంప్రదించవచ్చు.

పైన పేర్కొన్న కంపెనీల (మేనేజ్‌మెంట్, అడ్మినిస్ట్రేషన్) నిబంధనలు 2014, లిస్టింగ్ రెగ్యులేషన్స్ ప్రకారం వార్షికసర్వసభ్య సమావేశం నేపథ్యంలో కంపెనీ సభ్యుల రిజిస్టర్, షేర్‌ట్రాన్స్‌ఫర్ పుస్తకాలు 14 సెప్టెంబర్, 2023 గురువారం నుండి 20 సెప్టెంబర్, 2023 బుధవారం (రెండు రోజులతో సహా) వరకూ మూసి వుంటాయి.

For GOWRA LEASING & FINANCE LIMITED,
సం/-
(గౌరా శ్రీనివాస్)
మేనేజింగ్ డైరెక్టర్
(DIN: 00286986)

స్థలం: సికింద్రాబాద్
తేదీ 28-08-2023

స్వాతంత్ర్య సమరయోధులపైనా వివక్షే

- వారి త్యాగాలు ప్రజలకు తెలియాలి
- కార్పొరేట్ మీడియా వాస్తవాలు దాచేస్తోంది
- 'ఆఖరి యోధులు' పుస్తకావిష్కరణలో పాలగుమ్మి సాయినాథ్

పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న పాలగుమ్మి సాయినాథ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్వాతంత్ర్య సమరయోధులపైనా చరిత్ర వివక్షనే ప్రదర్శించిందని మెగసెసే అవార్డు గ్రహీత, ప్రముఖ జర్నలిస్ట్ పాలగుమ్మి సాయినాథ్ అభిప్రాయపడ్డారు. గ్రామ, తండా, పట్టణ స్థాయిల్లో బ్రిటీషర్లకు వ్యతిరేకంగా స్థానిక పోరాటాలు చేసిన యోధుల జీవిత చరిత్రల్ని ప్రజలకు పరిచయం చేసేందుకు ప్రభుత్వాలు సిద్ధంగా లేవన్నారు. పాలగుమ్మి సాయినాథ్ ఆంగ్లంలో 'లాస్ట్ హీరోస్' శీర్షికతో రాసిన పుస్తకాన్ని సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్ 'ఆఖరి యోధులు' పేరుతో తెలుగులోకి అనువాదం చేశారు. నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ ప్రచురించిన ఈ పుస్తకాన్ని సోమవారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు ఆవిష్కరించి, తొలి ప్రతిని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మికి అందచేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పాలగుమ్మి సాయినాథ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రెండేండ్ల క్రితం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ పేరుతో రూ.110 కోట్లను కేటాయించిందని తెలిపారు. అదే పేరుతో కేంద్ర ప్రభుత్వం ఓ వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసిందనీ, దానిలో స్వాతంత్ర్య పోరాట యోధుల కథలు, ఫోటోలు, ఫీచర్లు వంటివి ఏవీ లేవన్నారు. కేవలం ఆ వెబ్‌సైట్‌లో ప్రధాని నరేంద్ర మోడీ విభిన్న వేషాల్లో ఉన్న ఫోటోలు మాత్రమే ఉన్నాయని ఆక్షేపించారు. ప్రస్తుతం బ్రతికున్న స్వాతంత్ర్య పోరాట యోధుల ఫోటోలు సైతం ఆ వెబ్‌సైట్‌లో లేకపోవడం దురదృష్టకరమన్నారు. మరో ఐదేండ్లు దాటితే ఆనాటి యోధులు ఎవరూ బ్రతికుండే అవకాశం కూడా లేదన్నారు. స్వాతంత్ర్య పోరాటం అనగానే గాంధీ, నెహ్రూ, పటేల్, భగత్‌సింగ్ వంటి కొందరి పేర్లు మాత్రమే ప్రముఖంగా వినిపిస్తున్నాయనీ, ఇప్పుడు ఆ చరిత్రల్ని కూడా మరుగున పడేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యపోరాటం అసలు దేనికోసం జరిగిందనే మౌలిక ప్రశ్నతో కూడిన త్యాగాల వివరాలేవీ పాఠ్యాంశాల్లో లేవని విశ్లేషించారు. బ్రిటీష్ పాలనను ప్రజలు ఎందుకు వ్యతిరేకించారో భవిష్యత్ తరాలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ఆ విషయాల్ని ప్రజా బాహుళ్యంలో ప్రచారం చేయాల్సిన మీడియా కార్పొరేట్ గుప్పిట్లోకి వెళ్లిపోయిందనీ, అదానీ, అంబానీలు వాటిని స్వాధీనం చేసుకుని, 'విశ్వగురు' ఏది చెప్తే అదే నిజమని ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కెప్టెన్ భావ్, మల్లు స్వరాజ్యం, ఎన్ శంకరయ్య వంటి అనేకమంది సమరయోధులు క్షేత్రస్థాయిలో రైతులు, కార్మిక వర్గ ప్రయోజనాల కోసం పోరాటాలు చేస్తూ, నాయకుల్ని తయారు చేశారని చెప్పారు.

సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులు అందర్నీ ఒకేరకంగా గుర్తించట్లేదని అన్నారు. ప్రజా సమరయోధుల్ని ప్రజలే గుర్తుంచుకొని, కాపాడుకోవాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో ఆవిర్భవించిన చిన్న ఉద్యమాలే ఆ తర్వాత మహోద్యమాలుగా నిర్మాణమయ్యాయని ఉదహరించారు. భిన్న రూపాల్లో పోరాటాలు జరిగినా బ్రిటీష్ వలసవాద పాలన వారందర్నీ ఏకం చేసిందని విశ్లేషించారు. ఇప్పుడూ ప్రతి గ్రామంలోనూ కులవివక్ష, ఆత్మగౌరవం, గృహహింస, దురహంకారానికి వ్యతిరేకంగా జరిగే పోరాటాలు కనిపిస్తాయనీ, వాటన్నింటినీ సమ్మిళితం చేస్తూ మహోద్యమాల నిర్మాణం జరగాలని ఆకాంక్షించారు. కేంద్రంలోని పాలకులు, ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్‌పరివార్ శక్తులు జాతీయోద్యమాన్ని వక్రీకరిస్తున్నాయనీ, గాంధీ, నెహ్రూల పాత్రే లేదని వాదించేవారు ఇక సామాన్య ప్రజల పాత్రను ఎలా అంగీకరించే పరిస్థితులు లేవనీ, పైగా సావర్కార్ వంటి లొంగుబాటుదారుడి పాత్రను గొప్పగా చిత్రీకరిస్తూ ప్రచారం చేస్తున్నారని చెప్పారు. చరిత్రను తిరగరాయడం సాధ్యం కాక, అసలు చరిత్రనే చెరిపేసే ప్రయత్నం చేస్తున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు. కానీ ప్రజాపోరాటాల చరిత్రల్ని కాపాడుకుంటూ, భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉన్నదని అన్నారు. అనువాదకులు ఎస్ వినయకుమార్ 'ఆఖరి యోధులు' పుస్తక పరిచయం చేశారు. నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు కే ఆనందాచారి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ఆర్ వాసు ఆహూతుల్ని ఆహ్వానించారు. మేనేజర్ డీ కృష్ణారెడ్డి వందన సమర్పణ చేశారు.


మహిళలకు పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న డా. రవీందర్ రెడ్డి

పెరటి కోళ్ల పంపిణీ

- ఆర్థికంగా వెనుకబడిన షెడ్యూల్ కులాలు
- వ్యవసాయ అనుబంధ రంగాల్లో రాణించాలి
- డాక్టర్ రవీందర్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వెనుకబడిన షెడ్యూల్ కులాల వారు వ్యవసాయ అనుబంధ రంగాల్లో రాణించి, ఆర్థికంగా ఎదగాలని పివి నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి సూచించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలోని రేగడి దోస్వాడ గ్రామంలో ఎస్‌సిలకు వంద యూనిట్ల పెరటి కోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడిన షెడ్యూల్ కులాల వారు వ్యవసాయ అనుబంధ రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. అందులోనే భాగంగా కోళ్లను ఉచితంగా పంపిణీ చేసినట్టు చెప్పారు. రేగడి దోస్వాడ గ్రామాన్ని పివి నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ దత్తత తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఎలాంటి సహాయ, సహకారాలు అయినా ఇక్కడ అమలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ పెరటి కోళ్ల పెంపకంతో పాటు మేకలను ఉత్పత్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని, వీటిలో సైతం ఎస్‌సిలను భాగస్వాములను చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వెటర్నరీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ రఘునందన్, అసోసియేట్ అధ్యాపకులు డాక్టర్ ఉదయ్ కుమార్, జంతు ప్రొఫెసర్ డాక్టర్ నర్సింహ, వెటర్నరీ కాలేజ్ న్యూట్రిషన్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు గోపాలకృష్ణ, డాక్టర్ సత్యనారాయణ రాజు, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ పురుషోత్తం, డాక్టర్ యానిమల్, జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్‌కుమార్, రేగడి పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, పశువైద్య సిబ్బంది శ్రీను, సాగర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంస్కృతిపై మతోన్మాద దాడిని ఖండించండి

- పిఎన్‌ఎం సీనియర్ నాయకులు కె శాంతారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజా సంస్కృతిపై మతోన్మాదం దాడులను నిలువరించాలని పీఎన్‌ఎం సీనియర్ నాయకులు కె.శాంతారావు అన్నారు. ప్రజానాట్యమండలి నాలుగు రోజుల శిక్షణా తరగతులు రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని రాకేష్ మాస్టర్ నిలయంలో సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కె.శాంతారావు మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు, బాలికలపై హత్యలు, లైంగికదాడులు పెరిగిపోతూ, మానవ సంబంధాలు నశించిపోయాయన్నారు. దాడులు, దౌర్జన్యాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మానవ సంబంధాలు పూర్తిగా ఆర్థిక సంబంధాలుగా మారిపోయాయన్నారు. పాలకులు పేద, దళిత మహిళలపై దాడులను ప్రేరేపించే విధంగా వ్యవహరిస్తూ.. చట్టాలను తుంగలో తొక్కి రాజ్యాంగాన్ని కాలరాస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ఎండగడుతూ ప్రజా కళాకారులు ప్రత్యమ్నాయ ప్రజాసంస్కృతిని నిర్మించాలని పిలుపునిచ్చారు. పీడిత ప్రజలు సంఘటితమైన ప్రజాస్వామిక హక్కుల కోసం కళారూపాల ద్వారా పోరాటం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఎన్‌ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట నరసింహ, నాయకులు వేల్పుల వెంకన్న, వినోద్ కుమార్, గడ్డం గణేష్ , దుర్గయ్య, లక్ష్మనారాయణ, అంజమ్మ హరిత తదితరులు పాల్గొన్నారు.

గోల్డ్‌డ్రాప్ నుంచి లీటర్ పెట్ బాటిల్

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ వంటనూనెల ఉత్పత్తిదారు గోల్డ్‌డ్రాప్ కొత్తగా ఒక్క లీటర్ పెట్ బాటిల్‌ను విడుదల చేసినట్లు ప్రకటించింది. అన్ని భద్రతా చర్యలనూ పరిగణలోకి తీసుకుని వినియోగదారుల కోసం దీన్ని అందుబాటులోకి తెచ్చామని ఆ సంస్థ సేల్స్ అండ్ మార్కెటింగ్ డైరెక్టర్ మితేష్ లోహియా పేర్కొన్నారు. తమ సంస్థకు వినియోగదారుల భద్రత అత్యంత ప్రధానమైందన్నారు.. ఈ పెట్ బాటిల్స్‌లో ట్యాంపర్ ప్రూఫ్ సీల్స్, ఇతర అంశాలు ఉన్నాయన్నారు.

కూతురు మృతి తట్టుకోలేక తండ్రి ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అల్లారు ముద్దుగా పెంచుకున్న ఐదేళ్ల కూతురు అనారోగ్యంతో చనిపోతే.. అది తట్టుకోలేని ఆ తండ్రి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు.. ఈ ఘటన హైదరాబాద్ ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ ఆర్‌పి రోడ్డులో నివసిస్తున్న కిషోర్ (39) ఐదేళ్ల కూతురు ఆరాధ్య అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. దాంతో తీవ్ర మనస్తాపం చెందిన కిషోర్ సోమవారం ఉదయం ఖైరతాబాద్ ఎంఎంటిఎస్ రైల్వే ట్రాక్‌పై దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ కేసును రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని.. పూర్తి వివరాలు తర్వాత వెల్లడిస్తామని ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పర్పుల్ టర్టిల్స్ స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్

కాన్సెప్ట్ లైటింగ్, ఫర్నిచర్ స్టోర్ పర్పుల్ టర్టిల్స్ హైదరాబాద్‌లో కార్యకలాపాలు ప్రారంభించినట్లు తెలిపింది. సోమవారం జూబ్లీహిల్స్‌లో నూతన స్టోర్‌ను తెరిచింది. 2009లో రదీష్ రత్నాకర్ శెట్టి, గౌరవ్ రాయ్ స్థాపించిన ది పర్పుల్ టర్టిల్స్ భారతీయ డిజైనర్లు, వైవిధ్యమైన భాండాగారంలపై దృష్టి సారించిందని తెలిపింది. ఈ స్టోర్‌లో నిష్ణాతులైన అంతర్గత డిజైనర్‌లు ఉన్నారని రదీష్ శెట్టి పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్తలు సుబ్బరాజు పెన్మత్స,

ఒకటి నుంచి నిరసన కార్యక్రమాలు

- పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజల్లో చైతన్యం
- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సెప్టెంబర్ ఒకటి నుంచి 10వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు చేపడ్తామని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తెలిపారు. సోమవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. మండల, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, సామాన్యులు జీవించలేని పరిస్థితి నెలకొందని అన్నారు. అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగిపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని చెప్పారు. ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విలీన దినోత్సవాన్ని ప్రభుత్వ అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఎంతోమంది ప్రాణ త్యాగాల ఫలితంగా తెలంగాణ రాజ్యాన్ని దేశంలో విలీనం చేశారని, అందులో హిందువులు ముస్లింలు ప్రాణం కోల్పోయారని గుర్తు చేశారు. దీనిని కొన్ని మతతత్వ పార్టీలు తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, డా.మల్లు గౌతమ్‌రెడ్డి, భావండ్ల పాండు, రాగిరెడ్డి మంగారెడ్డి, తిరుపతి రామ్మూర్తి, పాల్వాయి రాంరెడ్డి, చిరుమళ్ల భిక్షం, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అవకాశం కల్పిస్తే బరిలో ఉంటా

- మిర్యాలగూడలో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం..
- టిపిసిసి కార్యదర్శి అలుగుబెల్లి అమరేందర్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దశాబ్ద కాలంగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తున్న తనకు ఈసారి టికెట్ ఇచ్చి అవకాశం కల్పిస్తే బరిలో ఉంటానని టిపిసిసి కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి అలుగుబెల్లి అమరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2009 నుంచి తాను ప్రజలతో మమేకమై ఉన్నానని, ప్రజారాజ్యం పార్టీ నుంచి రాజకీయ అరంగేట్రం చేసిన తాను ఎమ్మెల్యే బరిలో నిలిచి 36 వేల ఓట్లు సాధించానన్నారు. ఆపై తెలంగాణ సాధనలో అవిశ్రాంత పోరాటం చేశానన్నారు. నూతన తెలంగాణ రాష్ట్రంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచానని తెలిపారు. ఆ పైన జరిగిన రాజకీయ మార్పుల్లో భాగంగా కాంగ్రెస్‌లో చేరి, పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానని చెప్పారు. 2018లో టికెట్ ఆశించినప్పటికీ, అధిష్టానం బిసి సంఘం జాతీయ నాయకుడు ఆర్ కృష్ణయ్యకు కేటాయించిందన్నారు. అయినా తాను పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేశానని, స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం శక్తివంచన లేకుండా పనిచేసి అద్భుతమైన ఫలితాలు సాధించామన్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని అధిష్టానం తనకు మిర్యాలగూడ టికెట్ కేటాయించాలని కోరారు. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌లో చిన్న చిన్న అభిప్రాయ భేదాలు ఉండటం సహజమేనన్నారు. అధిష్టానం నిర్ణయం మేరకు అభ్యర్థి ఎవరైనా గెలుపు కోసం అందరం కలిసి కట్టుగా పనిచేస్తామన్నారు. మిర్యాలగూడ అభివృద్ధి చెందిందంటూ అధికార పార్టీ నాయకుడు గొప్పలు చెబుతున్నారని, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని అన్నారు. అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీని గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గాయం ఉపేందర్‌రెడ్డి, తమ్మన్న, డి బాలాజీనాయక్, పెదమం వీరస్వామి, తలకోల వెంకటరెడ్డి, తలకొప్పుల సైదులు, కంచుగట్ల లింగయ్యాయాదవ్, దండ ప్రభాకర్‌రెడ్డి, గజ్జల నర్సిరెడ్డి, షేక్ బిక్కన్, కస్తూరి భాస్కర్, ముజాహిద్, జావీద్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

బస్సు ఢీకొని పారిశుధ్య కార్మికురాలు మృతి

రోడ్డు పక్కనచెత్త ఊడ్చుతుండగా ఘటన..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రోడ్డు పక్కన చెత్త ఊడుస్తున్న జిహెచ్‌ఎంసి పారిశుధ్య కార్మికురాలిని వేగంగా దూసుకొచ్చిన ఓ ప్రయివేటు కళాశాల బస్సు ఢీ కొనడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణం కోల్పోయారు. ఈ ఘటన హైదరాబాద్ నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగిందిజ నారాయణగూడ సిఐ యు చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండి ప్రాంతానికి చెందిన తిప్పారపు సునీత (41) జిహెచ్‌ఎంసి, ఎస్‌ఎఫ్‌ఎ అర్జున్ టీంలో (21 మంది టీం) అవుట్ సోర్సింగ్ విభాగంలో పారిశుధ్య కార్మికురాలిగా పదేళ్ల నుంచి పనిచేస్తున్నారు. సోమవారం రాంకోఠి ప్రాంతంలో సునీత ఉదయం రోడ్డుపై చెత్త ఊడుస్తుండగా దుండిగల్ ప్రాంతానికి చెందిన అయాన్ ఇనిస్టిట్యూట్ మెడికల్ సైన్స్ కళాశాల బస్సు అతి వేగంగా వచ్చి ఆమెను ఢీకొట్టింది. దాంతో బస్సు, అక్కడే ఉన్న చెట్టుకు మధ్యలో ఆమె నలిగిపోయి విలవిల్లాడి అక్కడికక్కడే ప్రాణం విడిచారు. స్థానికుల సమాచారం మేరకు నారాయణగూడ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని బస్సు డ్రైవర్ ఎండి మహమ్మద్ మోమిన్‌ను అదుపులోకి తీసుకున్నారు. బస్సును సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. సునీత మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మిగతా సమాచారం కోసం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌కు ఈ కేసును బదిలీ చేసినట్టు నారాయణగూడ సిఐ తెలిపారు. కాగా.. సునీతకు కుమారుడు, కూతురు ఉన్నారు. ఆమె భర్త వికలాంగుడు అవడంతో ఇంటి బాధ్యతలు ఆమెనే మోసేది. నెలకు రూ.14 వేల వేతనంతో జీవనం కొనసాగించేది. సునీత తల్లి చంద్రకళ పారిశుధ్య కార్మికురాలుగా రిటైర్మెంట్ కావడంతో తల్లి ఉద్యోగం ఆమెకు వచ్చింది. ఇప్పుడు ఆ కుటుంబం ఉన్న ఒక్క ఆధారమైన పెద్దదిక్కును కోల్పోయింది.

ఎయిర్‌పోర్టులో 785 గ్రాముల బంగారం పట్టివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విదేశాల నుంచి శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి అక్రమంగా తరలించిన బంగారాన్ని హైదరాబాద్ కస్టమ్స్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. జేడ్డా నుంచి ఒక ప్రయాణికుడు తెల్లవారుజామున హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాడు. అతనిపై అనుమానం రావడంతో అతనితోపాటు లగేజ్‌ని తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో అక్రమంగా తరిస్తున్న 785 గ్రాముల బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.47.49 లక్షలు ఉంటుందని అంచనా. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

రెస్టారెంట్‌లో షార్ట్ సర్క్యూట్

- రూ.20 ఆస్తి మేర నష్టం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదిభట్ల సమీపంలోని ద ఫుడ్ ట్రైన్ రెస్టారెంట్‌లో షార్ట్ సర్క్యూట్ చోటుచేసుకోవడంతో ఎసిలు, ఫర్నిచర్స్, విద్యుత్ పరికరాలు దగ్ధమయ్యాయి. సుమారు రూ. 20 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్టు నిర్వాహకులు వాసుదేవన్, అఖిల్ తెలిపారు. పోలీసులు, నిర్వహకులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఆదిభట్ల టిసిఎస్ సమీపంలో ఉన్న దా ఫుడ్ ట్రైన్ రెస్టారెంట్ లోపలి నుంచి ఉదయం ఏడు గంటల సమయంలో తీవ్రమైన పొగ బయటకు వచ్చింది. గమనించిన స్థానికులు రెస్టారెంట్ యజమాని అఖిల్‌కు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. దాంతో తన రెస్టారెంట్‌లో పని చేసే సిబ్బందిని అతను అప్రమత్తం చేశారు. తాను వెంటనే రెస్టారెంట్‌కు చేరుకున్నారు. రెస్టారెంట్ తలుపులు తీసి చూడగా కౌంటర్ మంటలతో తగలబడుతోంది. రెస్టారెంట్ పూర్తిగా పొగతో నిండిపోవడంతో వారు మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అది సాధ్యం కాకపోవడంతో వెంటనే ఫైర్ స్టేషన్ అధికారులకు సమాచారం అందించగా.. వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అనంతరం పరిశీలించగా.. రెస్టారెంట్ కౌంటర్ వద్ద ఉన్న ఫర్నిచర్, రెస్టారెంట్‌కు సంబంధించిన పత్రాలు, ఐదు ఏసీలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.20 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. అయితే కిచెన్‌కు మంటలు వ్యాపించకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానిక పోలీసులు వివరాలు సేకరించారు. ఏసీల షార్ట్ సర్క్యూట్ వల్లనే ప్రమాదం జరిగినట్టు అనుమానిస్తున్నారు. కాగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

ఏది బ్రాండెడ్.. ఏది జనరిక్..?

- అధిక ధరలకు జనరిక్ మందుల విక్రయాలు
- రూ కోట్లలో ఔషధ వ్యాపారం
- హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో జోరుగా దందా
- పట్టించుకోని ఎడిలు, డిఐలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రోగుల అవసరాలు, వారి పరిస్థితులను కొంతమంది మెడికల్ షాపుల నిర్వాహకులు క్యాష్ చేసుకుంటున్నారు. నిబంధనలను తుంగలో తొక్కి జనరిక్ మందులను అధిక ధరలకు అంటగడుతున్నారన్న ఆరోపనలున్నాయి. బ్రాండెడ్‌కు బదులు జనరిక్ మందులు ఇస్తూ నిలువు దోపిడీ చేస్తున్నారు. ఏది బ్రాండెడ్, ఏది జనరిక్ మందులో జనం తెలుసుకోలేక మెడికల్ షాపుల మాయాజాలంలో పడుతున్నారు. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లోని ఎడిలు, డిఐలు నామమాత్రంగా దాడులు చేస్తున్నారు తప్ప కఠిన చర్యలకు వెనుకాడుతున్నారన్న విమర్శలున్నాయి. 'మెడికల్ షాపుల మాఫియా' వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. రూ.కోట్లలో వ్యాపారం సాగుతోంది.

హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో దాదాపు ఎనిమిది వేల వరకు మెడికల్ షాపులు ఉన్నాయి. ఏ మెడికల్ షాపులో చూసినా 80 శాతం మేర జనరిక్ మందులే అందుబాటులో ఉన్నాయి. వైద్యులు రోగులకు ఐదారు రకాల బ్రాండెడ్ మందులను రాస్తే.. కొన్ని మెడికల్ షాపుల్లో రెండు, మూడు రకాలు మాత్రమే ఇచ్చి మిగతావి జనరిక్ ఇచ్చేస్తున్నారు. జనరిక్ మందుల్లోనూ బ్రాండెడ్ మందుల మాదిరిగా ఫార్ములా ఒకే రకంగా ఉంటుందని, తక్కువ ధరకు లభించే జనరిక్ మందులను వాడాలని ప్రభుత్వాలు సైతం సూచిస్తున్నాయి. కానీ, కొంతమంది మెడికల్ షాపుల నిర్వాహకులు బ్రాండెడ్ ధరలకే జనరిక్ మందులు అంటగడుతున్నారు.

ధరల్లో భారీ వ్యత్యాసం

బ్రాండెడ్ మందులతో పోల్చితే జనరిక్ మందుల ధర తక్కువగా ఉంటుంది. వివిధ రోగాలకు సంబంధించిన మందుల ఫార్ములా ఒక్కటే అయినా బ్రాండెడ్ ధరలు 60-80 శాతం మేర ఎక్కువగా ఉంటాయి. ఉదాహరణకు అలర్జీ కోసం ఉపయోగించే సిట్రిజన్ ఫార్ములా కలిగిన ఒకాసెట్ ట్యాబెట్ల షీట్ (10 గోళీలకు) బ్రాండెడ్‌లో రూ.20కి అమ్ముతుండగా.. జనరిల్‌లో మాత్రం రూ.5కే విక్రయిస్తున్నారు. విటమిన్ డి-3, క్యాల్షియం ట్యాబ్లెట్లు (15 గోలీలకు) బ్రాండెడ్ రూ.90కి విక్రయిస్తుండగా, జనరిక్‌లో రూ.20కి అమ్ముతున్నారు. పక్షవాతం వచ్చిన రోగులకు సంబంధించి స్ట్రోసిట్ ప్లస్ ట్యాబ్లెట్లు (10)కి జనరిక్‌లో రూ.280కి లభిస్తుండగా.. మెడికల్ షాపుల్లో రూ.600కి అమ్ముతున్నారు. కొన్ని షాపుల్లో డిస్కౌంట్ పేరుతో అమ్మకాలను పెంచుకుంటున్నారు.

ఎమ్మార్పీల పేరుతో దగా..

దాదాపు అన్ని మెడికల్ షాపుల్లోనూ జనరిక్ మందుల విక్రయాలు సాగుతున్నాయి. ఒక్కో జనరిక్ స్ట్రిప్‌పై 50 శాతం మేర మెడికల్ షాపుల నిర్వాహకులు పర్సంటేజీలు పొందుతున్నారు. అసలు విషయం తెలియని రోగులు జనరిక్ మందులకు ఎమ్మార్పీ ధర చెల్లిస్తూ మోసపోతున్నారు. జీవన్‌ధార జనరిక్ షాపుల్లోనూ మెడికల్ షాపుల మాదిరిగా వివిధ రకాల మందుల ఎమ్మార్పీ ధరలు ఒకే విధంగా ఉన్నప్పటికీ అక్కడ దాదాపు 70 శాతం మేర తక్కువ ధరకు లభిస్తాయి. ప్రజలకు జనరిక్ షాపులపై అవగాహన లేక మెడికల్ షాపుల్లో కొనుగోలు చేస్తూ దోపిడీకి గురవుతున్నారు. పైగా మెడికల్ షాపుల్లో కొనుగోలు చేసిన మందులకు బిల్లులు కూడా ఇవ్వడం లేదు. జనరిక్ మందులపై అవగాహన కల్పించాల్సిన డ్రగ్ కంట్రోల్ ఎడిలు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఆ దిశగా కృషి చేయకపోవడంతో మెడికల్ మాఫియా రెచ్చిపోతోంది.

నామమాత్రపు తనిఖీలు

హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లోని డ్రగ్ కంట్రోల్ ఎడిలు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు మెడికల్ షాపుల్లో నామమాత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్టు విమర్శలు వస్తున్నాయి. ఈ ఏడాది జులై నెలలో కోఠి, అంబర్‌పేట, నాంపల్లి, లంగర్‌హౌస్, చార్మినార్, హుమాయన్‌నగర్, ఉప్పల్, గౌలిగూడ ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. కొన్ని మెడికల్ షాపుల లైసెన్స్‌లను శాశ్వతంగా రద్దు చేయగా, మరికొన్నింటి లైసెన్స్‌లను రెండు, మూడు వారాలపాటు తాత్కాలికంగా రద్దు చేశారు. ఆ తర్వాత అధికారులు అటువైపే చూడకపోవడంతో బిజినెస్ షరా మామూలుగా సాగుతోంది.

అలేరులో డిఆర్‌ఆర్ గ్రూపు కొత్త వెంచర్

- బ్రోచర్‌ను ఆవిష్కరించిన యాజమాన్యం

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ డిఆర్‌ఆర్ గ్రూపు అలేర్‌లో కొత్త వెంచర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను సోమవారం హైదరాబాద్‌లో గ్రేటర్ వెస్ట్ సిటీ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ మిర్యాల రాఘవరావు, డిఆర్‌ఆర్ గ్రూపు చైర్మన్ దాసరి రంగారావు, వి సుభద్ర రావు, చీటి మధుసుధన్ రావు లాంచనంగా ఆవిష్కరించారు. ఆ సంస్థ ఉన్నతికి తోడ్పాటునందిస్తున్న మార్కెటింగ్ హెడ్స్‌ను రంగారావు సత్కరించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ.. "హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విషయం జగమెరిన సత్యం. నగరం అభివృద్ధిలో రియల్ ఎస్టేట్ కీలక పాత్ర పోశిస్తోంది. అలాంటి రంగంలో కొనుగోలుదారుల పెట్టుబడికి డిఆర్‌ఆర్ గ్రూపు సరైన వేదిక. తమ వెంచర్లలో తక్కువ ధరల్లో ప్లాట్లు లభిస్తాయి." అని పేర్కొన్నారు. అలేరు టౌన్‌లో నూతన వెంచర్‌ను ఏర్పాటు చేస్తున్నామని సుభద్ర నరేంద్ర రావు పేర్కొన్నారు. ఇది ఇళ్లు నిర్మించుకోవడానికి అనువైన ప్రాంతమన్నారు. ఈకార్యక్రమంలో సంస్థ జిఎం కె రమేష్, తోట పాండు, మార్కెటింగ్ డైరెక్టర్లు వివి సుబ్బారావు, సిహెచ్ శ్రీనివాస రావు, పి నాగ కిషోర్, వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.